సాక్షి
అనంతపురం

శుక్రవారం । 19 । జూలై । 2024



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.19 వేలు పలికాయి.



కోర్ బ్రాంచ్‌లకు పెరిగిన క్రేజ్

ఇంజినీరింగ్ విద్యలో కోర్ బ్రాంచ్‌లకు క్రేజ్ పెరిగింది. విద్యార్థులు ఎక్కువగా ఈ బ్రాంచ్‌లకే మొగ్గు చూపుతున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/23.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించి, సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని కుటుంబాలను సర్వే చేశారని, ఎంత మంది కుష్టు రోగులను గుర్తించారని ఆరా తీశారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటిలో వారందరూ స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పాలిపోయిన మచ్చలు, దురదలేని మచ్చలు ఉంటే జాగ్రత్తగా పరిశీలించి రికార్డు చేయాలన్నారు. రోగులకు మంచి చికిత్సలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మండల డాక్టర్ తెహరున్నీసా, సీహెచ్‌ఓ మోహన్‌రావు, డీపీఎంఓ సత్య నారాయణ, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, సత్యనారాయణ శాస్త్రి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ధనుంజయ, ఆనంద్, గౌతమి, జ్యోతి, జయంతి, యామిని, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా అనిత



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ (ఎస్కేయూ) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ బి.అనిత నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.అనితకు అపారమైన బోధన, పరిశోధనానుభవం ఉంది. 14 ఏళ్ల ప్రొఫెసర్, ఎనిమిదేళ్ల అసోసియేట్, ఎనిమిదేళ్ల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఉమెన్స్ హాస్టల్ అడిషనల్ వార్డెన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఒక అంతర్జాతీయ సెమినార్, 3 జాతీయ సెమినార్లు నిర్వహించారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఉత్తమ మహిళా పరిశోధన అవార్డును 2019లో అందజేసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్, ఎంటీసీ, ఎడిటోరియల్ రివ్యూ బోర్డు ఇన్ ఆదర్శ బిజినెస్ రివ్యూ బోర్డులో సభ్యులుగా ఉన్నారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా నియమితులైన రెండో మహిళగా గుర్తింపు దక్కించుకున్నారు. గతంలో ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ ఎంసీఎస్ శుభ వ్యవహరించారు. మొత్తం మహిళా వీసీలుగా ప్రొఫెసర్ బి.అనిత నాలుగో వ్యక్తిగా గుర్తింపు లభించడం గమనార్హం. ప్రొఫెసర్ సరస్వతీరావు, ప్రొఫెసర్ పి.కుసుమకుమారి గతంలో మహిళా వీసీలుగా పనిచేశారు. ఇన్‌చార్జ్‌గా ఎంసీఎస్ శుభ, తాజాగాఅనితకు అవకాశం దక్కింది.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీగా సుదర్శనరావు



ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావుకు అభినందనలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ అయిన సుదర్శనరావు గతంలోనూ ఇన్‌చార్జ్ వీసీగా పనిచేశారు. తాజాగా మరోసారి ఇన్‌చార్జ్ వీసీగా అవకాశం దక్కడం గమనార్హం. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ వీసీకి ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. బోధన సిబ్బందితో పాటు పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

స్కియాడ్‌కు మోక్షమెన్నడో?

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం చాలా కష్టం. నైపుణ్యం పెంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలంటే తగిన కోచింగ్ తీసుకోవాలి. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు కోచింగ్ పొందడం ఆర్థికంగా భారమే. అలాంటి వారి కోసం శ్రీకృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ డెవలప్‌మెంట్ (స్కియాడ్) కల్పతరువుగా మారింది. రెండు దశాబ్దాలపాటు ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు సాధించడానికి తోడ్పాటునందించిన స్కియాడ్ మూత పడింది. ప్రస్తుతం ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగులు స్కియాడ్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ
- 2018లోనే స్కియాడ్ శిక్షణ కేంద్రం మూసివేత
- తాజాగా డీఎస్సీ, టెట్ నోటిఫికేషన్ల జారీ
- స్కియాడ్ శిక్షణ కేంద్రం పునరుద్ధరణకు డిమాండ్



మూతపడిన స్కియాడ్ శిక్షణ కేంద్రం

అనంతపురం: రాష్ట్రంలోనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఎంతోమంది విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ఈ యూనివర్సిటీలో సీట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులతో పాటు, నిరుద్యోగుల కోసం గ్రూప్–1, గ్రూప్–2, డీఎస్సీ తదితర ఉద్యోగ ఎంపిక పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణతో పాటు తర్ఫీదు ఇవ్వడానికి 1995లో శ్రీకృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అకడమిక్ డెవలప్‌మెంట్ (స్కియాడ్) శిక్షణ కేంద్రాన్ని ఎస్కేయూ నెలకొల్పింది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో చాలామంది పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఎస్కేయూ క్యాంపస్ విద్యార్థులు పోటీ పరీక్షల్లో చదువుతున్నారంటే తప్పనిసరిగా లక్ష్యాన్ని సాధించేవారు. గ్రూప్–1, గ్రూప్–2, డీఎస్సీ పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు సాధించే వారిలో సింహభాగం వర్సిటీ విద్యార్థులే ఉండేవారు. ప్రస్తుత ఎస్కేయూ రిజిస్ట్రార్ గతంలో స్కియాడ్ కోర్డినేటర్‌గా పనిచేసిన వారే. నిధుల లేమి కారణంగా 2017లో స్కియాడ్ శిక్షణ కేంద్రాన్ని యూనివర్సిటీ యాజమాన్యం మూసివేసింది. అప్పటి నుంచి దీని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం డీఎస్సీ, టెట్ నోటిఫికేషన్ జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో బయటకు వెళ్లి రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకోలేని పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు స్కియాడ్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు.

నైపుణ్య శిక్షణకు అవకాశం

పోటీపరీక్షలకే కాకుండా నైపుణ్యాలు పెంపొందించేందుకు స్కియాడ్ దోహదపడేది. నైపుణ్య రహిత విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందిస్తూనే పీజీ పూర్తి చేసుకునే అవకాశం ఉండేది. కంప్యూటర్ శిక్షణ, వివిధ రకాల ప్లాట్‌ఫాంలలో సాఫ్ట్‌వేర్ శిక్షణ కల్పిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు(కమ్యూనికేషన్స్ స్కిల్స్), లైఫ్ స్కిల్స్, స్పెయిన్, రష్యన్ భాషలు నేర్చుకుంటే మంచి ఉద్యోగాలు దక్కుతున్నాయి. ఈ క్రమంలో నైపుణ్య శిక్షణకు స్కియాడ్ సెంటర్‌ను వినియోగించుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పేద విద్యార్థుల పాలిట వరం



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా, నాణ్యమైన శిక్షణ ఇచ్చే కేంద్రంగా స్కియాడ్ ఒకప్పుడు అందరికీ వరంగా ఉండేది. ప్రస్తుతం స్కియాడ్ గురించి పట్టించుకునే వారే లేరు. నిధులు లేవనే ఉద్దేశంతో స్కియాడ్ పునరుద్ధరణ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. నిధుల సమీకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను ఉన్నతాధికారులు అన్వేషించాలి. పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవచ్చు. లేదా ఎస్కే యూనివర్సిటీ అంతర్గత నిధులను వెచ్చించవచ్చు. పేద విద్యార్థుల శ్రేయస్సు పట్టకుండా యూనివర్సిటీ ఉన్నతాధికారుల ఉదాశీన వైఖరి సరైందికాదు.

– డాక్టర్ కాంతికిరణ్, పీహెచ్‌డీ, జియాగ్రఫీ, ఎస్కేయూ క్యాంపస్

ఉచిత శిక్షణ అందుబాటులోకి తేవాలి



ప్రస్తుతం డీఎస్సీ, టెట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. డీఎస్సీ శిక్షణ తీసుకోవాలంటే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటోంది. అంత పెద్ద మొత్తంలో నగదు వెచ్చించాలంటే పేదలకు భారమే ఇలాంటి పరిస్థితుల్లో యూనివర్సిటీ విద్యార్థులకు దోహదపడే ఏకైక మార్గం స్కియాడ్. పేద విద్యార్థులకు దోహదపడే స్కియాడ్ కేంద్రాన్ని మూసివేసి ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎస్కేయూ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి స్కియాడ్ శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి.

– నెహెమ్యా చిన్నమల్లెల, ఎల్‌ఎల్‌బీ విద్యార్థి

ప్రగతి నివేదికలతో సుపరిపాలన

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: అన్ని ప్రభుత్వ శాఖలు రోజువారీ నివేదికలు అందించడం ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించేందుకు వీలవుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ప్రగతి నివేదికలు అందించే అంశంపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవితో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 103 శాఖలు ఉన్నాయన్నారు. ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలు రోజువారీగా అందించాలని ఆదేశించారు. రోజూ డ్రైవ్ చేపట్టడం ద్వారా ఆయా శాఖల పరిధిలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. పనితీరు కూడా మరింత మెరుగు పడుతుందన్నారు.

పథకాలు అర్హుల దరిచేర్చాలి

జిల్లా అధికారి అంటే చాలా బాధ్యతాయుతమైన హోదా అనే విషయాన్ని ఎవరూ మరవకూడదని కలెక్టర్ అన్నారు. కేటాయించిన లక్ష్యాలను అధిగమించినప్పుడే హోదాకు న్యాయం చేయగలరని సూచించారు. ప్రభుత్వ శాఖల పరిధిలో అమలయ్యే ప్రతి పథకాన్నీ ప్రజలకు తెలియజేయాలని, అదే క్రమంలో అర్హులైన వారి దరిచేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి 'డైరీ రిపోర్టింగ్ మేనేజ్మెంట్' చేసి వివరాలు అందించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం

- గంజాయి నియంత్రణకు చర్యలు
- అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు
- నూతన ఎస్పీ మురళీకృష్ణ





కలెక్టర్ వినోద్‌కుమార్, డీఐజీ షిమోషిని కలిసి మొక్కలు అందజేసిన నూతన ఎస్పీ మురళీకృష్ణ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

అనంతపురం: జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని నూతన ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. ఆయన గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అనకాపల్లి నుంచి సాధారణ బదిలీపై అనంతపురానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒక్కటైన బేసిక్ పోలీసింగ్ అంశాలపై దృష్టిసారిస్తామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నియంత్రణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాదారులు, విక్రేతలు, వినియోగదారులను గుర్తించి చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మహిళలు, చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వాళ్లకు, నేరాలకు పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కళాశాల యజమానులు, పరిశ్రమల యజమానుల సహకారం తీసుకుంటామన్నారు.

సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డుల నుంచి పోలీసు సిబ్బంది, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలతో మమేకమై మెరుగైన సేవలు అందిస్తూ పోలీసు శాఖ పట్ల విశ్వాసాన్ని, ప్రతిష్టను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. పోలీసులు, మీడియా కలిసి సుహృద్భావ వాతావరణంలో ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తామని స్పష్టం చేశారు.

- కలెక్టర్ వినోద్‌కుమార్‌ను, డీఐజీ డాక్టర్ షిమోషిని నూతన ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా వారి కార్యాలయాల్లో కలిశారు.

ఎస్పీకి ఘన స్వాగతం

జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నూతన ఎస్పీ మురళీకృష్ణకు ఘన స్వాగతం లభించింది. అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ నూతన ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీలు టీవీవీ ప్రతాప్, బి.శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డి, జనార్దన నాయుడు, బీవీ శివారెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ శంకర్, సీఐలు ఇందిర, షేక్ జాకీర్, రెడ్డప్ప, క్రాంతికుమార్, ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇస్మాయిల్, వెంకటేశ్ నాయక్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

మాజీ సైనికుల గృహ నిర్మాణాల్లో అవినీతి



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు తమ సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన మాజీ సైనికులు


- ఖాళీ చెక్కులు తీసుకుని, లోన్లు చేసుకున్న బిల్డర్లు
- ఇళ్లు చేతికి రాకపోయినా లోన్లు కట్టాల్సిన దుస్థితి
- కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసిన మాజీ సైనికులు

అనంతపురం అర్బన్ : కూడేరు వద్ద సైనికపురంలో చేపట్టిన మాజీ సైనికుల గృహనిర్మాణాల్లో అవినీతి వెలుగు చూసింది. రెండు దఫాలుగా మాజీ సైనికుల పేరిట బిల్డర్లు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. ఇళ్లు మాత్రం పూర్తి చేయకుండా రూ.4 కోట్లకు పైబడి అక్రమాలకు పాల్పడ్డారు. తమకు జరిగిన అన్యాయంపై మాజీ సైనికులు గురువారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను చాంబర్‌లో కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు బీసీఆంజనేయులు, సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి, సంజీవ రాయుడు, తదితరులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి 70 మంది మాజీ సైనికుల నుంచి బిల్డర్లు ఖాళీ చెక్కులు తీసుకున్నారని చెప్పారు. ఇళ్ల నిర్మాణం చేపట్టకుండానే 2019లో ఒక్కొక్కరి పేరిట రూ.2.50 లక్ష చొప్పున బ్యాంకు నుంచి రుణాన్ని బిల్డర్లు మంజూరు చేయించుకున్నారన్నారు. అదే తరహాలో 2020 మార్చి- ఏప్రిల్ మధ్య ఒక్కొక్కరి పేరున రూ.4 లక్షలు చొప్పున రెండో దఫా లోన్ మంజూరు చేయించుకున్నారని చెప్పారు. బేస్‌మెంట్ వరకే నిర్మాణాలు చేసి వదిలేశారన్నారు. ఇళ్లు పూర్తి కాకనే తమను రుణ కంతులు కట్టాలని బ్యాంకర్లు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డర్ల వద్దకు వెళితే తమపైనే దౌర్జన్యానికి వస్తున్నారని తెలిపారు. విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

మా సంక్షేమంపై దృష్టి సారించండి

తమ సంక్షేమంపై దృష్టి సారించాలని మాజీ సైనికులు కలెక్టర్‌ను కోరారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.విశ్వేశ్వరావు, నాయకులు రమేష్‌రెడ్డి తదితరులు కలెక్టర్‌ను చాంబర్‌లో కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు మీడియాతో మాట్లాడారు. మాజీ సైనికులకు ఐదు ఎకరాలు భూమి, ఇంటి స్థలం కేటాయించాలని కోరారు. సైనికుల పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుపై రాయితీ సదుపాయం కల్పించాలని కోరారు. ఉద్యోగాల విషయంలో స్థానికేతరులకు కాకుండా స్థానికులైన మాజీ సైనికులకు కల్పించాలన్నారు. ఉద్యోగ నియామకాల్లో ఇప్పటి వరకు ఉన్న 2 శాతం రిజర్వేషన్‌ను 5 శాతానికి పెంచాలనే తమ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గన్ లైసెన్స్ మంజూరు, గన్ లైసెన్స్ రెన్యూవల్, చుక్కల భూమికి ఎన్‌ఓసీ ఇవ్వడంతో పాటు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎంఎస్ ప్రసాద్, బీసీ ఆంజనేయులు, పెద్దారెడ్డి, నల్లపురెడ్డి, కె.రాజు, నాగేంద్రప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

తుంగభద్రకు భారీ వరద



- రికార్డు స్థాయిలో 1.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతపురం సెంట్రల్/ బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద నీరు భారీగా చేరుతోంది. బుధవారం 49,522 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం రికార్డు స్థాయిలో 1,21,160 క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎగువన అప్పర్ తుంగా ప్రాజెక్ట్ నిండటంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దానికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతూ వస్తున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రారంభంలో డ్యాంకు ఇన్‌ఫ్లో అనుకూల స్థాయికి చేరి, ఆ తర్వాత చాలా రోజులు ఇన్‌ఫ్లో తగ్గి రైతులను ఆందోళనకు గురి చేసింది. ఈసారి ముందుగా వర్షాలు కురువడం, ఇన్‌ఫ్లో పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి 50.025 టీఎంసీలకు చేరుకుంది. మరి కొద్దిరోజుల పాటు ఇన్‌ఫ్లో కొనసాగితే జలాశయం పూర్తిగా నిండనుంది. డ్యాం నుంచి 300 క్యూసెక్కుల నీటిని రాయబసవన కెనాల్, జిందాల్‌కు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు వరి, మిరప నార్లు బోర్ల కింద సాగు చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి 1,589.90 అడుగుల నీటి మట్టంతో 10.947 టీఎంసీల నీరు జలాశయంలో నిల్వ ఉంది.

మద్యం మత్తులో డ్రైవింగ్

- బోల్తా పడిన స్కూల్ బస్సు
- విద్యార్థులకు గాయాలు



బోల్తా పడిన స్కూల్ బస్సు (ఇన్‌సెట్‌లో) మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ కృష్ణమూర్తి

రాప్తాడు: డ్రైవర్ బాధ్యతా రాహిత్యం విద్యార్థుల ప్రాణాలమీదకు తెచ్చింది. మద్యం మత్తులో అతివేగంగా నడుపుతూ మలుపు వద్ద వేగం నియంత్రించలేకపోవడంతో బస్సు రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒక ఉపాధ్యాయుడితో పాటు ఆరుగురు విద్యార్థులు తీవ్రంగాను, మరో 24 మంది స్వల్పంగాను గాయపడ్డారు. రాప్తాడు మండలం యర్రగుంట సమీపంలో ఈ సంఘటన జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని రుద్రంపేట సమీపాన వికలాంగుల కాలనీలోని శ్రీరామ క్రిష్ణ విద్యాలయం (ఎస్ఆర్‌కే ప్రైవేట్ స్కూల్) ప్రైవేట్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లి, మరూరు, కృష్ణాపురం, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, ఎం.బండమీదపల్లి గ్రామాల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరినీ స్కూలుకు చెందిన రెండు బస్సుల్లో తీసుకెళ్తుంటారు. యథావిధిగా గురువారం కూడా రెండు బస్సుల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు. డ్రైవర్లలో ఒకరైన కృష్ణమూర్తి మధ్యాహ్నం మద్యం తాగాడు. తోటి డ్రైవర్ వద్దని వారించినా వినలేదు. సాయంత్రం పాఠశాల వదిలిన వెంటనే ఏపీ02 టీడీ 0977 నంబరుగల బస్సులో డ్రైవర్ కృష్ణమూర్తి, ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్‌లు దాదాపుగా 70 మంది విద్యార్థులను ఎక్కించుకుని వారి గ్రామాలకు బయల్దేరారు. రామినేపల్లి వద్ద 13 మంది విద్యార్థులు బస్సు దిగారు. మిగిలిన 57 మంది విద్యార్థులను వారి గ్రామాలకు తీసుకెళ్లే క్రమంలో యర్రగుంట సమీపాన మలుపులో వేగం అదుపు కాక బస్సు రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్‌కు తీవ్ర గాయలయ్యాయి. 24 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో 108 సిబ్బంది ప్రమాద స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి వారి గ్రామాలకు తరలించారు.

ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటండి



ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి సూచించారు. గురువారం బుక్కరాయసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో 'హరిత అనంత' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు నాటి కాలుష్య నివారణకు కృషి చేయాలని కోరారు. ఎంపీపీ సునీత, ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ పోలేరయ్య, ఏఓ శ్రీవాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర కార్యవర్గంలో 'అనంత' డ్యాన్సర్లు



లక్ష్మీకాంత్, వినోద్‌కుమార్

అనంతపురం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్స్ మాస్టర్స్, డ్యాన్సర్స్ యూనియన్ (ఏపీఎఫ్‌టీడీయూ) రాష్ట్ర కార్యవర్గంలో అనంత డ్యాన్స్ మాస్టర్లకు చోటు దక్కింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన సీనియర్ కొరియోగ్రాఫర్ లక్ష్మీకాంత్, కార్యవర్గ సభ్యుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన డ్యాన్స్‌మాస్టర్ వినోద్‌కుమార్ ఎంపికయ్యారు. తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సినీ నిర్మాత రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాది దుర్గాభవానీ, ఇతర సభ్యుల సమక్షంలో ఇటీవల నూతన కమిటీని ఎంపిక చేశారు. కీలక పదవులు దక్కించుకున్న అనంత వాసులను అనంత డ్యాన్సర్స్ అసోసియేషన్ నిర్వాహకులు హరిప్రసాద్, వన్నూరు మాస్టర్ అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ... టీవీ, సినీ పరిశ్రమల్లోకి రావాలనుకుంటున్న జిల్లాకు చెందిన ఔత్సాహిక కళాకారుల ప్రతిభను రాష్ట్ర స్థాయి సభ్యులు గుర్తించేలా చేసి, అవకాశాలు దక్కేలా కృషి చేస్తానన్నారు.

రైల్వే అధికారుల క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న సీనియర్ డీఎంఈ ప్రమోద్

గుత్తి: ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించి స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్ క్రీడా మైదానంలో గురువారం రైల్వే అధికారుల క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. టోర్నీని డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీ వరకూ టోర్నీ కొనసాగుతుందన్నారు. రైల్వే అధికారులు, కార్మికులకు సంబంధించి మొత్తం 16 జట్లు ఈ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నాయన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

రాయదుర్గం: చదవడం ఇష్టం లేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం డి.కొండాపురం గ్రామానికి చెందిన చెంగల్‌రాయుడు కుమార్తె పాశేగారి జెస్సిత (16) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుని ఉత్తీర్ణత సాధించింది. ఈ క్రమంలో తల్లిదండ్రులు ఇంటర్మీడియట్‌లో చేరాలని సూచించారు. అయితే చదువుకోవడం ఇష్టం లేని ఆమె ఇంటర్‌లో చేరేందుకు విముఖత వ్యక్తం చేసింది. చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయినా జెస్సితాలో మార్పు రాలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రుల ఒత్తిళ్లను తాళలేక్షణికావేశంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కోర్ బ్రాంచ్‌లకు పెరిగిన క్రేజ్

- ఏపీ ఈఏపీసెట్‌లో ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తి
- కంప్యూటర్ సైన్సెస్‌కు తొలి ప్రాధాన్యత
- నాణ్యత ప్రమాణాలున్న కళాశాలలో కోర్ బ్రాంచ్‌లైనా పర్వాలేదు
- ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో తొలి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు నేరుగా కళాశాలల్లో రిపోర్టు చేయాలి. అయితే ఈ నెల 19 నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 396 సీట్లు ఉండగా 389 సీట్లు, ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో 330 సీట్లకు గాను 255 భర్తీ అయ్యాయి. జేఎన్‌టీయూ(ఏ)లో మొత్తం 6 విభాగాలు ఉండగా ప్రతి విభాగంలో 66 చొప్పున సీట్లు ఉన్నాయి. కెమికల్ ఇంజినీరింగ్‌లో 65, సివిల్ ఇంజినీరింగ్ 64, కంప్యూటర్ సైన్సెస్ 66, ఈసీఈ 65, ఈఈఈ 64, మెకానికల్ విభాగంలో 65 సీట్లు భర్తీ అయ్యాయి.

బ్రాంచ్ కన్నా కళాశాలే ముఖ్యం

గతేడాది కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల వైపు అత్యధిక శాతం విద్యార్థులు ఆసక్తి చూపించారు. దీంతో కంప్యూటర్ సైన్సెస్ వాటి అనుబంధ కోర్సులకు అప్పట్లో భారీ డిమాండ్ నెలకొంది. తాజాగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కోర్సు కంటే కళాశాల వైపు మొగ్గు చూపుతున్నారు. నాణ్యత ప్రమాణాలు గల కళాశాలలో సీటు దక్కితే చాలు బ్రాంచ్ ఏదైనా పర్వాలేదనే ధోరణి వ్యక్తమవుతోంది. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కంప్యూటర్ సైన్సెస్‌తో పాటు కోర్ బ్రాంచ్‌లు అయిన ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ కోర్సులకూ డిమాండ్ నెలకొంది. మంచి ర్యాంక్ వచ్చిన విద్యార్థులు తమ తొలి ప్రాధాన్యతగా కంప్యూటర్ సైన్సెస్‌కు ఆప్షన్ ఇచ్చారు. జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు సంబంధించి తొలి ఐదు సీట్లను రాష్ట్ర స్థాయిలో 889, 1013, 1221, 1446, 1502 ర్యాంకులు సాధించిన వారు దక్కించుకున్నారు. ఈసీఈ విభాగంలో 1,871, 2,077, 2,409, 2,805, 2,977 ర్యాంకుల వారికి తొలి ఐదు సీట్లు దక్కాయి. ఎస్ఆర్ఐటీ (అటానమస్)లో 10,949 నుంచి 12,751 లోపు ర్యాంకు వారికి సీఎస్ఈ సీట్లు దక్కాయి.

ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో భర్తీ అయిన సీట్ల వివరాలు

కళాశాల	అనుమతించిన సీట్లు	భర్తీ అయినవి
ఎస్ఆర్ఐటీ	576	545
అనంతలక్ష్మి	720	687
గేట్స్	624	585
ఎస్ఎస్ఎస్ఈ	288	263
పీవీకేకే ఓసీ	288	238
పీవీకేకే	384	280
ఎస్‌వీఐటీ	408	280
సీవీఆర్‌టీ	300	195
టెక్	336	205
సంస్కృతి	288	263

స్పెయిన్ కోచ్‌ల శిక్షణను సద్వినియోగం చేసుకోండి


స్పెయిన్ కోచ్‌లతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: స్పెయిన్ కోచ్‌ల శిక్షణను సద్వినియోగం చేసుకుని బాస్కెట్‌బాల్ క్రీడలో రాణించాలని క్రీడాకారులకు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ క్రీడలో నైపుణ్యాలు గడించేలా ధర్మవరం క్రీడాకారులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని గురువారం స్పెయిన్ కోచ్‌లు మార్, ఒరియోల్, పోల్, నటాలియాతో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆర్డీటీ సహకారంతో ఈ నెల 30వ తేదీ వరకూ రోజూ ఉదయం, సాయంత్రం స్పెయిన్ కోచ్‌లు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. గతంలో స్పెయిన్ కోచ్‌ల వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు నేడు జాతీయ స్థాయి జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌ను స్పెయిన్ బృందం అందజేసింది. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, జస్వంత్, హరిజిత్ ప్రణవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పురుగు పట్టిన బియ్యానికి పాలిష్

- వెలుగు చూసిన వ్యాపారి అక్రమ దందా

తాడిపత్రి రూరల్: పురుగు పట్టిన సోనా మసూరి బియ్యాన్ని పాలిష్ చేసి అధిక ధరకు వినియోగదారులకు విక్రయించేందుకు సిద్ధమైన వ్యాపారి గుట్టు రట్టయ్యింది. ఈ అంశం కాస్త సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్ కావడంతో తాడిపత్రి పట్టణ వాసులు ఆందోళనకు గురయ్యారు. వివరాలు.. తాడిపత్రిలోని ఓ కిరాణా దుకాణ నిర్వాహకుడి వద్ద సోనా మసూరి బియ్యం బస్తాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో పురుగు పట్టాయి. విషయాన్ని గుర్తించిన ఆయన ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తే అసలుకే మోసం వస్తుందని భావించిన సదరు దుకాణదారుడు వ్యాపారంలో తాను నష్టపోకుండా ఉండేందుకు ప్రజారోగ్యంతో చెలగాటమాడేందుకు పథకం రచించాడు. ఇందులో భాగంగా పురుగు పట్టిన బియ్యాన్ని పాలిష్ చేసి కొత్త బస్తాల్లో నింపి అధిక ధరకు విక్రయించేందుకు స్థానిక ఓ రైస్‌మిల్లర్‌తో ఒప్పందం చేసుకుని, ఓ ట్రాక్టర్‌లో లోడ్ చేయించి మిల్లుకు తరలించాడు. ఈ విషయం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సీఎస్‌డీటీ రాజా అప్రమత్తమయ్యారు. ఘటనపై విచారణ చేపట్టి, వాస్తవాలు నిర్ధారించుకుని అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.


పురుగు పట్టిన బియ్యం బస్తాలను ట్రాక్టర్‌లో రైస్‌మిల్లుకు తరలిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో రాక్షస పాలన

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ

ఉరవకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. వరుస హత్యలు, దాడులతో టీడీపీ గుండాలు పేట్రేగిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గురువారం ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా లోపించాయన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం టీడీపీ గుండాలకు పరిపాటిగా మారిందన్నారు. పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డప్పను పరామర్శించేందుకు ఆయన ఇంటికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డితో పాటు రెడ్డప్పపై కూడా దాడికి తెగబడ్డారన్నారు. వినుకొండలో పట్టపగలే నడిరోడ్డుపై వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ అబ్దుల్ రషీద్‌ను అత్యంత కిరాతకంగా టీడీపీ గుండా హతమార్చినా కూటమి ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందన్నారు. అధికారం చేపట్టిన ఓ నెల రోజుల వ్యవధిలోనే 31 మంది హత్యకు గురయ్యారన్నారు. టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక మరో 35 మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని దీనికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగానికే పోలీసులు సలాం కొడుతూ హత్యలు, దాడులపై కేసులు కూడా నమోదు చేయడం లేదని మండిపడ్డారు. టీడీపీ హత్యా రాజకీయాలను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

మడకశిర రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మడకశిర మండలం గొడనహళ్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి, మెళవాయి వెలసిన రంగనాథస్వామికి గురువారం భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్, ఆలయం వద్ద భక్తుల సందడి


మెళవాయిలో రంగనాథస్వామి జ్యోతుల ఉత్సవం


జమ్మానిపల్లి నుంచి ఊరేగింపుగా జ్యోతులు తెస్తున్న దృశ్యం

'తల్లికి వందనం' ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు


మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ... జీఓ 117 రద్దు చేసి 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఉపసంహరించుకోవాలన్నారు. విలీనం ప్రక్రియతో మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీఓ 117 రద్దు చేయాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను పూర్వ ఐచ్ఛిక పద్ధతిలో ప్రవేశ పెట్టాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్ మాట్లాడుతూ... ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు సంబంధించి అన్ని జిల్లాల్లోనూ పీఎఫ్ సైట్ అప్‌డేట్ చేసినా అనంతపురం జిల్లాలో మాత్రం కాలేదన్నారు. దీంతో వేలాది మంది ఉపాధ్యాయులు పార్ట్ ఫైనల్, లోన్ల కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సైట్‌ను అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటగిరి వన్నప్ప, జిల్లా నాయకులు పాతిరెడ్డి, ప్రసాద్, హనుమంతు, ఈశ్వరయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

చిప్పగిరి ఎంపీపీ కారు ధ్వంసం


కారును పరిశీలిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

గుంతకల్లు: కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి ఎంపీపీ జూటూరు హేమలతకు చెందిన కారుపై దుండగులు దాడి చేశారు. ఘటనలో కారు పైకప్పు అద్దాలు ధ్వంసమయ్యాయి. చిప్పగిరికి చెందిన హేమలత తన భర్త జూటూరు మారయ్యతో కలసి కొన్నేళ్లుగా గుంతకల్లులోని హౌసింగ్ బోర్డులో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కారు పైకప్పు అద్దాలను ధ్వంసం చేసిన విషయాన్ని గురువారం ఉదయం 11 గంటల సమయంలో వారు గుర్తించారు. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక కారును ధ్వంసం చేసినట్లుగా ఈ సందర్భంగా వారు వాపోయారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఎంపీపీ కారుపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి గురువారం మధ్యాహ్నం ఎంపీపీ ఇంటికి చేరుకుని ఆరా తీశారు. ఈ అంశాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేయనున్నామన్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ... వెంటాడి పట్టుకున్న పోలీసులు


రిమాండ్ ఖైదీని ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన దృశ్యం

అనంతపురం: విశాఖ నుంచి అనంతపురానికి తీసుకొస్తున్న గుత్తి మండలం టి.కొత్తపల్లికి చెందిన రిమాండ్ ఖైదీ నరేష్ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. గంజాయి, చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న నరేష్ విశాఖ సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. పీటీ వారెంట్ కింద రైలులో జిల్లా పోలీసులు తీసుకువస్తుండగా బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ప్రకాశం జిల్లా మార్కాపురం వద్ద తప్పించుకున్నాడు. విషయం తెలుసుకున్న అనంతపురం నాల్గోపట్టణ కానిస్టేబుల్ రామాంజనేయులు అప్రమత్తమై తనకున్న నెట్‌వర్క్ ద్వారా వలపన్ని నిందితుడిని పట్టుకోగలిగాడు. అనంతరం భారీ బందోబస్తుతో ఉరవకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మవరం రూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం – చిగిచెర్ల రైల్వే స్టేషన్ల మధ్య గురువారం ఉదయం 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైలు నుంచి ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94405 57054లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

సమష్టిగా పనిచేద్దాం : ఎస్పీ


అదనపు ఎస్పీ, డీఎస్పీలతో సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడకుండా హోదాలు మరచి సమష్టిగా పనిచేద్దామంటూ సిబ్బందికి ఎస్పీ కేవీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాలోని డీఎస్పీలు, అదనపు ఎస్పీలతో డీపీఓలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని తాజా పరిస్థితులను సమీక్షించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల్లో భరోసా కల్పించేందుకు దోహదం చేసే బేసిక్ పోలీసింగ్ మెరుగుపడాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా వేయాలన్నారు. ప్రతి హౌస్ ఆఫీసర్ గ్రామ సందర్శన చేయాలన్నారు.

అత్యవసర సమయంలో స్పందించిన వైద్య సిబ్బంది


ప్రసవం అనంతరం చంటిబిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న హెల్త్ సెంటర్ సిబ్బంది

బెళుగుప్ప: షేక్‌రేష్మా అనే గర్భిణి కుటుంబ సభ్యులతో కలిసి కారులో గురువారం అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళ్తుండగా, మార్గంమధ్యలో పురిటినొప్పులు వచ్చాయి. ఉన్నపళంగా నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోయారు. ఆమెను కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై ఉన్న కాలువపల్లి హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన హెల్త్ సెంటర్ సీహెచ్‌ఓ సుభాన్ గ్రామంలోనే లెప్రసీ సర్వే క్యాంపులో ఉన్న పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన ఆదేశాలతో ఏఎన్ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, ఆశ వర్కర్ లక్ష్మీదేవి కలసి గర్భిణీకి చికిత్సలు అందించి, కాన్పు చేయడంతో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. అత్యవసర సమయంలో కాలువపల్లి హెల్త్ సెంటర్‌లో ప్రసవం చేసిన వైద్యసిబ్బంది గర్భిణి భర్త షేక్ దాదాపీర్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మిక శాఖ ఏసీగా కృష్ణారెడ్డి



అనంతపురం సిటీ: కార్మిక శాఖ జిల్లా సహాయ కమిషనర్ (అసంఘటిత రంగ కార్మికుల విభాగం)గా బీవీఎస్ కృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలో పని చేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు ఇటీవలే అనంతపురానికి బదిలీ చేశారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించి కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్యను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

కల్లూరులో చైన్‌స్నాచింగ్

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న సాయమ్మ దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును ఓ దుండగుడు అపహరించుకెళ్లాడు. గురువారం దుకాణం వద్దకు వచ్చిన యువకుడు రూ.100 చేతికి ఇచ్చి బీడీలు కావాలన్నాడు. ఆమె బీడీలు ఇచ్చి చిల్లర ఇచ్చేందుకు కిందకు చూస్తున్న తరుణంలో ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసు లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సచివాలయానికి పసుపు రంగు


పేరూరు సచివాలయానికి పసుపురంగు వేసిన దృశ్యం

రామగిరి: రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు పంచాయతీ కార్యాలయాలకు పసుపు రంగు పులిమేస్తున్నారు. శిలాఫలకాలకు, పార్కులో బెంచీలకు కూడా పసుపు రంగు వేస్తున్నారు. తాజాగా రామగిరి మండలం పేరూరు పంచాయతీలోని గ్రామ సచివాలయానికి పసుపు రంగు వేశారు. ఈ చర్యలను స్థానికులు తప్పుబడుతున్నారు. ఇది సచివాలయమా... లేక టీడీపీ కార్యాలయమా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవచేయాలంటే రంగులు అవసరం లేదని, సేవాగుణం ఉంటే చాలని హితవు పలుకుతున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి



సిక్కిం సీఎంకు వినతిపత్రంతో పాటు జ్ఞాపికను అందజేస్తున్న ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆలిండియా డ్రైవర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పి.రమేష్‌బాబు కోరారు. మూడు రోజుల కిందట సిక్కిం రాష్ట్రం గాంగ్టక్‌లో నిర్వహించిన ఆలిండియా ప్రభుత్వ డ్రైవర్ల ఫెడరేషన్ సమావేశంలో రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్‌కు ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అద్దె వాహనాలను తీసివేసి కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని కోరారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రమేష్‌బాబుతో పాటు ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షులు వై.నాగేశ్వరరావ్, పి.నాగభూషణ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు



నూతన డైరెక్టర్ ఢిల్లీరావుతో అసోసియేషన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన ఢిల్లీరావును అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నాయకులు గురువారం విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్యాంసుందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీనివాస్, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేపు శతచండీ రుద్ర యాగాలు

అనంతపురం కల్చరల్: లోక కల్యాణం కోసం శనివారం శతచండీ, రుద్ర మహాలక్ష్మీయాగం నిర్వహిస్తున్నారు. స్థానిక పాతూరు దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు జరిగే మహా యాగాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

ఏడు శనివారాల వ్రతాలు

నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా ఆషాఢ, శ్రావణమాసాల్లో అత్యంత ఘనంగా నిర్వహించే ఏడు శనివారాల వ్రతాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. ఏకరూప దుస్తుల్లో వందలాది మహిళలు సామూహిక వ్రతమాచరిస్తారని, ఆసక్తి కల్గిన వారు ఆలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసాద్

అనంతపురం అర్బన్: స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గురువారం కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలిశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌ను పూర్తి చేయడంలో నెలకొన్న ఇబ్బందులపై కలెక్టర్‌తో చర్చించానన్నారు. అక్కడి వివాద స్థలానికి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సెంట్రల్‌పార్క్ స్థలంలో ఆక్రమణల తొలగింపు, డంపింగ్ యార్డులో మొక్కల పెంపకం తదితర అంశాలపై మాట్లాడానన్నారు. అలాగే నగర పాలక సంస్థలో జరిగినట్లు వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. జాయింట్ కలెక్టర్‌తో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెల్లడించారు.

వీల్‌చైర్ల పంపిణీ



వీల్ చైర్లను అందజేస్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఎన్ఎస్‌గేట్‌లోని పీహెచ్‌సీకి గురువారం వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీకి నాలుగు, ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీకి రెండు వీల్ చైర్లను ఎంపీడీఓ మోహన్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, మాజీ ఎంపీపీ అమరేంద్రతో పాటు పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం



హజరత్ సయ్యద్ వలి పీర్లతో నగరోత్సవం



5వ రోడ్డులో ఖలేషా మస్తాన్ వలి పీర్ల సందడి



నాల్గవ రోడ్డు పెనుకొండ బాబయ్య పీర్ల ఊరేగింపు

అనంతపురం కల్చరల్: నగరంలో పదిరోజులుగా సాగిన మొహర్రం ఉత్సవాలు గురువారం రాత్రి ఊరేగింపు, జలధి కార్యక్రమాలతో ముగిశాయి. నాలుగు, ఐదవ రోడ్ల పీర్ల ముగింపు ఉత్సవాలతో సందడిగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వేర్వేరు మకానాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. నాలుగో రోడ్డులోని హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి పీర్లు, పెనుకొండ బాబయ్య పీర్లను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు అడుగడుగునా చక్కెర చదివింపులు, హారతులతో భక్తిశ్రద్ధలతో వేడుకలను ముగించారు. ఐదవ రోడ్డులోని కసుమూరు ఖలేషా మస్తాన్ వలి పీర్లను బాధాకరమైన గీతాలతో జలధికి పంపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ కులాలు, మతాలకతీతంగా పెద్ద పీర్ల పండుగ ఎంతో సందడిగా ముగిసిందని, 20న చివరి దర్శనముంటుందని చెప్పారు. మరో నాలుగు రోజుల తర్వాత చిన్నపీర్ల పండుగ, జాతర మరింత ఘనంగా జరుగుతుందన్నారు.

జలధికి తరలిన పీర్లు

రాప్తాడురూరల్: మొహర్రం వేడుకల్లో భాగంగా అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామంలో గురువారం పీర్లు జలధికి వెళ్లాయి. తొలుత ఖాసీం, కుళ్లాయిస్వామి పీర్లను పూలతో అలంకరించారు. చివరిరోజు కావడంతో ఉదయమే పీర్ల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జలధికి వెళ్లాయి. వేడుకల్లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు, బొమ్మేపర్తి, లింగనపల్లి గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు శుక్రవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 18వ తేదీ వరకు హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు. మరింత సమాచారం కోసం 08554–286777 (భారత్ గ్యాస్), 08554 246199 (హాసిని ఇండేన్ పవన్ గ్యాస్), 08554 228789 (హనుమాన్ హెచ్‌పీ గ్యాస్)లో సంప్రదించవచ్చు.

ఘనంగా చిన్న సరిగెత్తు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో గురువారం ఘనంగా చిన్న సరిగెత్తు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల చావిడిలో పీర్ల స్వాములను వెండి గొడుగులతో అలంకరించి పూలమాలలు వేశారు. అదే విధంగా గ్రామంలో పలువురు చిన్న సరిగెత్తు సందర్భంగా పానకాల కుండలను తీసుకెళ్లి పీర్ల మసీదులో చదివింపులు చేయించి పకీర్లు అయ్యారు. అనంతరం గ్రామంలో భక్తులు చక్కెర చదివింపులు చేశారు.

తారస్థాయికి టీడీపీ అరాచకాలు

- మేయర్ మహమ్మద్ వసీం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే టీడీపీ నేతల అరాచకాలు తారస్థాయికి చేరాయని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. వరుసగా జరుగుతున్న దారుణాలే అందుకు సజీవ సాక్షాలన్నారు. టీడీపీ నాయకుల దాడుల్లో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను పరామర్శించడానికి వెళుతున్న ఎంపీ మిథున్‌రెడ్డిపై పుంగనూరులో దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. ఒక ఎంపీకే రక్షణ లేకుంటే ఇక సాధారణ పౌరులకు ఈ ప్రభుత్వం ఏమాత్రం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ యువ నాయకుడిని నడిరోడ్డులో కత్తులతో కిరాతకంగా నరికి చంపారంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత ఘోరంగా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చూస్తుంటే భయమేస్తోందన్నారు. నెల రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలు, కిడ్నాప్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనిత సమాధానం చెప్పాలన్నారు. ఈ అరాచకాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, కమల్ భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, శీనా పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక అవార్డు జగన్ పాలనకు సాక్ష్యం

రాప్తాడురూరల్: ఆంధ్రప్రదేశ్‌కు 2023– 24 సంవత్సరానికి ప్రతిష్టాత్మక నీతి అయోగ్ అవార్డు రావడం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు నిలువెత్తు సాక్ష్యమని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీ రమణ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వంలో 'స్థిరాస్తి, సుస్థిరాభివృద్ధి' సూచికలలో దేశంలోనే మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టిన కారణంగా నీతి అయోగ్ అవార్డు ప్రకటించిందని పేర్కొన్నారు. ఏడు కేటగిరీలలో మన రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలబడిందని తెలిపారు. 3.8 శాతం ఉన్న స్థిరాస్తి 4.5 శాతానికి ఎగబాకడం, 5.7 శాతం ఉన్న నిరుద్యోగం 4.4 శాతానికి తగ్గడం, విద్య, వైద్య రంగాలలో 87.97 నుంచి 96.9 శాతం ప్రగతి సాధించడం, 17.6 నుంచి 6.06 శాతానికి పేదరికం తగ్గిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 'నాడు– నేడు' కింద ఆధునీకరించడం, ప్రపంచాన్నే కబళించిన కరోనా మహమ్మారితో రాష్ట్రం ఆర్థికంగా చిన్నాభిన్నం అయినా మొక్కవోని దీక్షతో ఇంతటి ప్రగతి సాధించడం సంచలనంగా అభివర్ణించారు. ఇది జగన్ పాలనా దక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఇలాంటి పాలనను ఆదర్శంగా తీసుకోవాల్సిన నేటి కూటమి ప్రభుత్వం పూర్తి భిన్నమైన పద్ధతులలో విధ్వంసాన్ని సృష్టించడానికి పూనుకుందని మండిపడ్డారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రవి

రాప్తాడు: వావాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయడంతో పాటు పంట మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ రవి సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. అలాగే రైతు సేవ కేంద్రంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులు తరుచూ ఒకే పంటను సాగు చేయకుండా పంట మార్పిడి తప్పనిసరిగా చేయాలన్నారు. పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. కౌలు రైతులు ఉంటే సంబంధిత వీఆర్‌ఓ, ఆర్ఎస్‌కే సిబ్బందికి తెలియజేసి కౌలు పత్రం పొందాలన్నారు. పీఎం కిసాన్ వెరిఫికేషన్ ఇంకా పూర్తి కాని రైతులు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్ రెడ్డి, ఏఈఓ రంజిత, ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

అనంతపురం క్రైం: కేంద్ర ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీతో మాట్లాడుతూ మోదీ సర్కారు 2020–21 రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో రైతులు, రైతు కూలీ తరపున వ్యవసాయ రంగం అభివృద్ధిపై మీ వాణి వినిపించాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

రాప్తాడు: స్థానిక షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద సాయంత్రం భక్తాదులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

27న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన మండలస్థాయి అధికారులతో సమావేశమై ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి మూడు రోజులు ముందుగానే సంబంధిత శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

వైద్య పరికరాల వితరణ



స్టంట్‌లు, ఇతర పరికరాలను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: సర్వజన ఆస్పత్రికి గుండె జబ్బులకు సంబంధించిన స్టంట్‌లు, కిడ్నీ వ్యాధులకు సంబంధించిన పరికరాలను వితరణ చేశారు. దాదాపు రూ. 26 లక్షల విలువ చేసే ఈ పరికరాలను స్నేహలత హాస్పిటల్స్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ లారెన్స్ మోస్లీ, రోస్లీన్ బౌమెన్ అందజేశారు. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఆయనతో పాటు డిప్యూటీ ఆర్ఎం డాక్టర్ వి.పద్మజ, ఆలంబన స్వచ్ఛంద సంస్థ జనార్దన్, డాక్టర్ మనోరంజన్‌రెడ్డి తదితరులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థుల హాజరు పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2 రామాంజినేయులు

ఆత్మకూరు: పాఠశాలలకు సక్రమంగా వచ్చే విద్యార్థుల శాతాన్ని పెంచాలని ఎంఈఓ-2 రామాంజినేయులు తెలిపారు. గురువారం మండలంలోని రంగంపేటలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతంగా ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

వీకే ఆశయాలు కొనసాగిస్తాం



అన్నదానం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ యోధుడు వీకే ఆదినారాయణరెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు అన్నారు. వీకే 27వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సర్వజన ఆస్పత్రి ఎదుట అన్నదానం నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ నారాయణ మాట్లాడుతూ జిల్లాలో వేళ్లానుకుపోయిన ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెకలించాల్సిన అవసరం ఉందని నాలుగు దశాబ్దాల కిందటే వీకే ఆదినారాయణరెడ్డి వీరోచిత పోరాటాలు చేశారని గుర్తు చేశారు. జిల్లాకు కృష్ణా జలాలను మళ్లించాలని సుదీర్ఘ పోరాటం నిర్వహించిన ఘన చరిత్ర వీకేకు దక్కుతుందని ఎస్కేయూ న్యాయ శాస్త్ర విభాగపు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ పుల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో వీకే రంగారెడ్డి, రాకెట్ల మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, యు.రామచంద్రారెడ్డి, జి.నారాయణరెడ్డి, సాధన గిరి తిరుపతయ్య, బి.రామ్మోహన్, లీలాధర్ ప్రసాద్, నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు రాచమల్లు భోగేశ్వరరెడ్డి, తలారి రామాంజనేయులు, పి.నాగరాజు, రేపటి రామాంజనేయులు, డి కుళ్లాయప్ప పాల్గొన్నారు.

బ్రిటీషర్లపై తిరుగుబాటు చేసిన వీరుడు వీకే

రాప్తాడురూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన వీరుడు కామ్రేడ్ వీకే ఆదినారాయణరెడ్డి అని వక్తలు కొనియాడారు. వీకే ఆదినారాయణరెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అనంతపురం రూరల్ మండలం సమతా గ్రామ్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున హాజరయ్యారు. ముందుగా వీకే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ ముఖ్య నాయకులలో ఒకరైన వీకే ఆదినారాయణ రెడ్డి పోరాటాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వీకే ఆదినారాయణ రెడ్డి, నీలం రాజశేఖర్‌రెడ్డి, ఐదుకల్లు సదాశివన్, అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీని బలంగా నిర్మించారన్నారు. విద్యార్థి దశలోనే ఆర్ట్స్ కాలేజీలో బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటాలు చేసి జైలుకు వెళ్లారన్నారు. కష్ట జీవుల కోసం కమ్యూనిస్టు పార్టీ తరఫున పోరాటం చేశారన్నారు. రాయలసీమకు కృష్ణా జలాలు, శ్రీశైలం జలాలు తీసుకొచ్చేందుకు అనేక పోరాటాలు చేశార్నారు. అప్పట్లో వీకే ఆదినారాయణ రెడ్డి చేసిన పోరాట ఫలితమే ఇప్పుడున్న హంద్రీ–నీవా ప్రాజెక్టు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, నియోజకవర్గ నాయకులు దుర్గాప్రసాద్, నగేష్, మండల నాయకులు జీపీ ఓబులేసు, మన్నీల వెంకటరాముడు, శ్యామ్, హుస్సేన్ పీరా, వెంకటరాముడు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని బిందెల కాలనీలో గురువారం పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46,120 స్వాధీనం చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు దాడులు చేసి, జూదరులపై కేసు నమోదు చేశామన్నారు.

అగ్ని గుండంలో పడి వ్యక్తికి గాయాలు



గాయపడిన సూర్యప్రకాష్

తాడిపత్రి రూరల్: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో గురువారం అగ్ని గుండంలో పడి సూర్యప్రకాష్(38) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పీర్ల పండుగ సందర్భంగా పీర్లను అగ్ని గుండం దాటించే సమయంలో ప్రమాదవశాత్తూ సూర్యప్రకాష్ గుండంలో పడిపోయాడు. ఈ ఘటనలో అతడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు.

సన్మార్గంలో నడవాలి



పూజలు చేస్తున్న రామానుజ జీయర్ స్వామి

తాడిపత్రి అర్బన్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని అహోబిల రామానుజ జీయర్ స్వామి సూచించారు. గురువారం పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వంకదారి మద్దిలేటి తదితరులు రామానుజ జీయర్ స్వామికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలోకి అడుగుపెట్టగానే రామానుజ జీయర్ స్వామి నేరుగా అమ్మవారి గర్భాలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. అనంతరం స్వామిజీ అక్కడున్న ఆర్యవైశ్యులను ఉద్దేశించి మాట్లాడారు. స్వార్థ చింతనను వదిలేసి నిస్వార్థ సేవ చేయడం అలవర్చుకోవాలన్నారు. నిత్యం భగన్నామస్మరణ చేస్తుండాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వామ్ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగరత్న, కార్యదర్శి నగరూరు స్వర్ణలత, ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వేడుక

- కనుమ వెంకటేశ్వరాలయంలో కల్యాణోత్సవం
- స్వామివారిని దర్శించుకున్న భక్తజనం



అలంకరణలో ఓబుళ లక్ష్మీనరసింహస్వామి



కనుమ వెంకటేశ్వరస్వామి



వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉపవాసాలతో వేడుకలను ప్రారంభించారు. గురువారం ఉదయమే దేవాలయంలోని స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. బెంగళూరు నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక పుష్పాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహంతో పాటు మూల విరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు ఉమ్మడి అనంతపురము జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అలాగే యర్రజిన్నన్నగారిపల్లి సమీపంలో ఉన్న కొండపై వెలసిన నరసింహస్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండకింద పరుస నిర్వహించారు.

కనుమ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ...

చెన్నేకొత్తపల్లి మండలం పైలబోయలపల్లి గ్రామ సమీపంలో కొండల నడుమ వెలసిన కనుమ వెంకటస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామివార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

రెండు దుకాణాల్లో చోరీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో ఉన్న నూర్ ఆప్టికల్స్, జేకే సెలూన్ షాప్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణాల షట్టర్స్‌కు వేసిన తాళాలను పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు ఆప్టికల్స్ షాప్‌లో రూ.10 వేల నగదు, కంటి అద్దాలు, జేకే సెలూన్‌లో రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆయా దుకాణదారులు రోషన్ జమీర్, హరీష్ చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.